పడకేసిన పల్లె వైద్యం

- డాక్టర్ల సమ్మెతో 104 సేవలకు బ్రేకులు
- బోసిపోతున్న పీహెచ్‌సీలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

మంత్రాలయం : ఇంటింటి వైద్యాన్ని అట కెక్కించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పల్లె వైద్యానికీ చేటు తెచ్చింది. పల్లె వైద్యుల సమస్యకు పరిష్కారం చూపక పల్లె వైద్యానికి బ్రేకులు వేసింది. వైద్యుల సమ్మెతో ఎక్కడి సేవలు అక్కడే ఆగిపోయాయి. పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స పడకేసింది. 104 సేవలు పల్లె చూపుకు దూరమయ్యాయి. ఇవేమి పట్టని కూటమి ప్రభుత్వం పల్లె వైద్యులతో పంతం పెట్టుకుని రోగులకు కన్నీళ్లు పెట్టిస్తోంది. రోగుల ప్రాణాలతో ఓరకంగా చెలగాట మాడుతోంది. వైద్య సేవలు నిలిచిపోవడంతో పల్లె రోగులు పడుతున్న యాతన వర్ణనాతీతం.

120 గ్రామాలకు వైద్య సేవలు

మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 94 పంచాయతీలు కలవు. మూడు లక్షలకు పైగా జనాభా కలదు. నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. మంత్రాయలయంలో కల్లుదేవకుంట, కాచాపురం, కోసిగిలోని కందుకూరు, కోసిగి, కౌతాళం మండలంలో బదినేహాల్, కౌతాళం, పెద్దకడబూరులో హెచ్.మురవణి, పెద్దకడబూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలో 120 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానంగా మొత్తం నియోజకవర్గంలో 104 వాహనాలు 8 ఉన్నాయి. 104 వాహనాలతో ప్రతి పల్లెలో 15 రోజులకోసారి



నిలిచిపోయిన 104 వాహనాలు

చికిత్సలు అందిస్తూ వస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యులు రోజుకొకరు చొప్పున 104 వాహనాలతో పర్యటించి పల్లెరోగులు సేవలు అందిస్తూ వచ్చారు.

సేవలపై 'సమ్మె'ట

104 వాహనాల సేవల నిమిత్తం పీహెచ్‌సీ వైద్యులు అలవెన్స్‌లు ఇవ్వాలన్న డిమాండ్ ప్రభుత్వం ముందు ఉంచారు. కూటమి ప్రభుత్వం దిగిరాకపోవడంతో పల్లెవైద్యులు ఉద్యమబాట పట్టారు. సేవలను నిలిపివేసి సమ్మెలోకి వెళ్లారు. కారణంగా పల్లె రోగులకు కష్టాలు చేరువయ్యాయి. ఏ చిన్న రోగం వచ్చినా జేబులకు పని చెప్పుకోవాల్సి వస్తోంది. ఆర్ఎంపీలను ఆశ్రయించి చికిత్సలు పొందుతున్నారు. ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తుల ఇబ్బందులు వర్ణనాతీతం. 104 వాహనాల్లో ప్రతి 15 రోజులకోసారి షుగర్ టెస్టులు చేసుకుని మందులు పొందేవారు. ప్రస్తుతం వాహనాలు నిలిచిపో


కల్లుదేవకుంట పీహెచ్‌సీలో రోగికి చికిత్స చేస్తున్న స్టాఫ్ నర్సు

వడంతో ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వచ్చింది. బాలింతలు, గర్భిణులకు ఇక్కట్లు చేరువయ్యాయి. గర్భిణులు నెల పరీక్షలు చేయించుకోవడానికి ప్రైవేటు ఆసుపత్రుల్లో గైనకాలజిస్టులను సంప్రదిస్తున్నారు. ఇక మంచానికి పరిమితమైన రోగుల తిప్పలు మరీ దారుణం.

బోసిపోయిన పీహెచ్‌సీలు

వైద్యుల లేక పీహెచ్‌సీలు బోసిపోయాయి. ఓపీల సంఖ్య కూడా రోజురోజుకు పడిపోయింది. గతనెల 29 నుంచి డాక్టర్లు సమ్మెలో వెళ్లడంతో పీహెచ్‌సీలో సేవలు తగ్గుముఖం పట్టాయి. గతంలో 8 పీహెచ్‌సీల్లో రోజుకు వెయ్యికిపైగా ఓపీలు ఉండగా ప్రస్తుతం 500కు దిగజారింది. కారణం పరీక్షలు చేసే వైద్యులు లేకపోవడం. కేవలం ఫార్మాసిస్టులు మందు బిళ్లలు ఇవ్వడం, స్టాఫ్ నర్సుల ద్వారా గర్భిణులకు, బాలింతలకు ప్రథమ సేవలు మాత్రమే జరుగుతున్నాయి. అయితే ఫార్మాసిస్టులు మందు బిళ్లలు ఇవ్వడం పట్ల వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ల ప్రిస్కిప్షన్ లేకుండానే ఎలా మందులు ఇస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ఏదైనా రోగులకు ఇబ్బందులు కల్గితే ఎవరు బాధ్యులంటూ నిలదీస్తున్నారు. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వైద్యుల సమస్యను పరిష్కరించి సేవలు మొదలు పెట్టాలని కోరుతున్నారు.

రక్త పరీక్ష కోసం ఇబ్బందులు



మాది చెట్నిహళ్లి గ్రామం సుస్తి చేస్తే రక్త పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్లు చెప్పారు. మా ఊరికి 104 వాహనం రాకపోవడంతో కల్లుదేవకుంట ఆసుపత్రికి వచ్చాను. ఇక్కడ డాక్టర్లు ఎవ్వరూ లేరు. వాహనం లేకపోవడంతో రక్త పరీక్షలు చేయించుకోవడానికి ఇంత దూరం రావాల్సి వచ్చింది. పిల్లాపాపలను వెంట తెచ్చుకుని పరీక్షలు చేయించుకునేందుకు ఇబ్బంది పడ్డాను.

– ప్రియాంక, చెట్నిహళ్లి

క్లుప్తంగా

పద్మశాలీయులు ఆర్థికంగా బలోపేతం కావాలి


మాట్లాడుతున్న పద్మశాలి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు

కోసిగి: పద్మశాలి కులబాంధవులు అన్నీ రంగాల్లో రాణించి ఆర్థికంగా బలోపేతం కావాలని పద్మశాలి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు ఆంజనేయులు అన్నారు. ఆదివారం కోసిగి శ్రీ మార్కండేయ స్వామి ఆలయ కళ్యాణ మండపంలో మండల స్థాయి పద్మశాలి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులబాంధవుల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామిని ప్రతి సోమవారం దర్శించుకుని పూజలు చేసుకుంటే మంచి జరుగుతోందన్నారు. ఆలయం అభివృద్ధికి అందరు కలిసి కట్టుగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి జేరుబండి నరసింహులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ ఆపాలి


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర

ఆదోని రూరల్: ఆదోని మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం డీవైఎఫ్ఐ ఆదోని మండల కమిటీ సమావేశం మండల నాయకులు శ్రీకృష్ణ అధ్యక్షతన సూపర్ బజార్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పేరుతో ప్రజల సొమ్మును, ప్రజల ఆస్తులను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు ఇవ్వడం పనిగా పెట్టుకుందని విమర్శించారు. దేశంలోని ప్రతి పౌరునికి ఉచిత విద్య, వైద్యం అందించాలని రాజ్యాంగం చెబుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ మండల కన్వీనర్ బీసీ వీరేష్, నాయకులు గర్జప్ప, హుసేన్, రమేష్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



గ్రామ పెద్దలకు రూ.2 లక్షలు విరాళం అందజేస్తున్న రంగారెడ్డి

నందవరం : మండల పరిధిలోని ముగతి గ్రామంలో వెలసిన సుంకులమ్మ దేవి ఆలయ నిర్మాణానికి ఆదివారం గ్రామానికి చెందిన భీమారెడ్డి కుమారుడు రంగారెడ్డి రూ. 2 లక్షలు విరాళంగా అందజేశారు. నగదును గ్రామ పెద్దలు విరూపాక్షిరెడ్డి, ఈరన్నగౌడ్, సోమశంకర్‌రెడ్డి, భార్గవ్ యాదవ్, రాఘవరెడ్డికి అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉరుకుందు రెడ్డి, సోమేశ్, తారకరాముడు, సోమనాథ్, నాగిరెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో హమాలీల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బాలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మార్కెట్‌యార్డ్ సూపర్‌వైజర్ ఎర్రిస్వామికి వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడారు. హమాలీలకు రెండు జతల యూనిఫాంలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. లైసెన్స్‌లను రెన్యూవల్ చేయాలని, కొత్త వారికి కొత్త లైసెన్స్‌లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు మల్లికార్జున, రైతు కూలీ సంఘ నాయకులు సత్యన్న, పెద్దరెడ్డి, వీరేష్ స్వామి, బాష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన


పూజలందుకుంటున్న రామమ్మదేవి

నందవరం : మండల పరిధిలోని గంగవరం గ్రామంలో నిర్మించిన నూతన ఆలయంలో ఆదివారం రామమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మ వారికి మూడు రోజుల పాటు విశిష్ట పూజలు, హోమాలు గావించారు. అనంతరం నూతన ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన చేశారు. ఉత్సవంలో గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రహ్లాదరెడ్డి, వెంకటరామిరెడ్డి, గ్రామ సర్పంచ్ బైటిగేరి శివన్న, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

15న స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని అర్బన్: ఈనెల 15వ తేదీన ఆదోని పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో 17వ విడత స్వర్ణామృత ప్రాసనం మందు పంపిణీ చేస్తున్నట్లు అవోపా మాజీ అధ్యక్షుడు కాకుబాళ్ నగేష్, ఆదోని అవోపా పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి 16 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు పుష్యమి నక్షత్రం రోజున (15-10-2025)న బుధవారం ఉదయం 7 గంటలకు అమూల్యమైన వెలకట్టలేని ఈ మందులను ఉచితంగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. ప్రాచీన కాలం నుంచి శిశు సంస్కారంలో ఒకటిగా స్వర్ణామృతప్రాసనం ఔషధం ఉందని చెప్పారు. ఈ ఔషధం రోగ నిరోధకశక్తి పెంచడం, మేధాశక్తిని పెంచడం, మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదం చేస్తుందన్నారు. 98494 78178 నంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పోలీస్ కస్టడీకి నిందితులు

ఆదోని అర్బన్: పందుల అపహరణ కేసులో గత నెల 13వ తేదీన అరెస్టు అయ్యి రిమాండ్‌లో ఉన్న ఆరుగురు నిందితులను ఆదివారం కస్టడీలో తీసుకుని విచారణ చేస్తున్నట్లు త్రీటౌన్ ఎస్ఐ రామస్వామి తెలిపారు. డీఎస్పీ హేమలత, త్రీటౌన్ సీఐ రామలింగమయ్య ఆదేశాల మేరకు రిమాండ్‌లో ఉన్న ఆరు మందిని కస్టడీలోకి తీసుకుని విచారణ చేస్తున్నామన్నారు.

స్పిన్నింగ్ మిల్ యాజమాన్యంపై పోరాడుదాం

ఆదోని రూరల్/ఆదోని సెంట్రల్: రాయలసీమ స్పిన్నింగ్ మిల్ యాజమాన్యం మొండి వైఖరికి వ్యతిరేకంగా పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మిల్లు మూతపడి 25 సంవత్సరాలు అవుతున్నా, దాదాపుగా 150 మంది కార్మికులకు గ్రాట్యుటీ, పీఎఫ్, పెన్షన్ తదితర సమస్యలు ఇప్పటివరకు పరిష్కారం కాలేదన్నారు. వీటి మీద కార్మికులు అనేక సంవత్సరాలుగా ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా మిల్లు యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ, కార్మికులకు తీవ్ర ద్రోహం చేస్తోందన్నారు. యాజమాన్యానికి ప్రధాన రాజకీయ పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో కార్మికుల సమస్య ఇప్పటివరకు పరిష్కారంకాకుండా ఉందన్నారు.


మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప

ఇప్పటికే కార్మికుల సమస్యను ప్రభుత్వం దృష్టికి, ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకువచ్చినా, సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వెంకప్ప, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు నారాయణ, మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న

ఆదోని సెంట్రల్: గొనెగొండ్ల మండలంలోని గాజుల దిన్నె గ్రామంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు బసవరాజుపై విద్యార్థి తండ్రి రంగస్వామి దాడి చేయడం అమానుషమని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి. సుంకన్న అన్నారు. ఆదివారం ఎస్టీయూ కార్యాలయంలో ఆదోని, కౌతాళం మండలాల ఎస్టీయూ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై దాడులు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని తెలిపారు. దీంతో మహిళా ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులకు గురైన సందర్భాలు లేకపోలేదన్నారు. విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులపై దాడులు చేయడం హేయమైన చర్యని అన్నారు. దాడులకు పాల్పడుతున్న వారిపై కేసు నమోదు చేసి కఠినమైన చర్యలు చేపట్టాలని వారు కోరారు. జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు రామాంజినేయులు, నాయకులు షేక్షావలి, సుధాకర్, వేణుగోపాల్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.


జొహరాపురం వద్ద పొలంలోనే వదిలేసిన ఉల్లి పంట

ఉల్లి రైతు.. కన్నీరు

నందవరం: ఆరు గాలం శ్రమించి పంటలు పండించే ఉల్లి రైతుకు కూటమి ప్రభుత్వం కంట కన్నీరు మిగిల్చింది. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అన్నదాతలు ఆర్తనాదాలు పెడుతున్నారు. గిట్టుబాటు ,ధరలు లేక ఉల్లి పంటలను పొలంలోనే పశువులలకు వదిలేసి అప్పులపాలవుతున్నారు. పండించిన ఉల్లిని మార్కెట్‌కు తీసుకెళ్తే పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదు. ప్రభుత్వం మొదట ఉల్లి క్వింటాకు రూ.1200 ధర కల్పిస్తామని చెప్పింది. తరువాత ఎకరానికి రూ.20 వేలు చొప్పున నష్ట పరిహారం అందిస్తామని చెప్పి, ఇంత వరకు అమలు చేయకపోవడంతో ఉల్లి రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని జొహరపురం గ్రామానికి చెందిన కురవ భీరప్ప అనే రైతు ఎకర పొలంలో ఉల్లి పంటను రూ.70 వేలు ఖర్చు చేసి సాగు చేశాడు. మార్కెట్లో ఉల్లికి ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా రావని, కోత, రవాణా ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉండడంతో పొలంలోనే జీవాలకు మేతగా వదిలేశాడు. మండలంలో దాదాపు 405 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. వారు కూడా చేసేది లేక ఉల్లి పంటను తొలగించారు. మరి కొంత మంది పొలంలోనే వదిలేశారు.

'ప్రైవేటు'పై ప్రేమ.!

- డీఈఓ ఆదేశాలు బేఖాతరు
- రిపోర్టు తయారీలో మీనమేషాలు
- ఎంఈవో తీరుపై సర్వత్రా విమర్శలు

మంత్రాలయం: కనీస వసతులు లేకున్నా.. విద్యార్థులు ఆపసోపాలు పడుతున్నా.. ఇక్కడి విద్యాధికారికి అవేమీ పట్టవు. ప్రైవేటు పాఠశాలల వైపు కన్నెత్తి చూడరు. ప్రైవేటు ప్రేమలో జోగుతూ ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం ఖాతరు చేయడం లేదు. మంత్రాలయం మండలంలో 10 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. అందులో మూడు పాఠశాలలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. మిగతా పాఠశాలలన్నీ రేకుల షెడ్లలో నడుపుతున్నారు. మండల కేంద్రంలో గ్లోబల్ జీనియస్, శారద, శ్రీవైష్ణవి, స్లేట్ స్కూళ్లు రేకుల షెడ్లతో నెట్టుకొస్తున్నారు. కొన్ని పాఠశాలలు స్ట్రక్చరల్ సౌండ్‌నెస్ సర్టిఫికెట్లు సమర్పించకుండా నడుపుతున్నారు. ఈ పాఠశాలలను ఇటీవల జిల్లా విద్యాధికారి శ్యామూల్‌పాల్ తనిఖీ చేయడం జరిగింది. అందులో


రేకుల షెడ్‌లో గ్లోబల్ స్కూలు

గ్లోబల్ జీనియస్ స్కూలు షెడ్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతులు సరిగ్గా లేకపోవడంపై అసంతృప్తి వెళ్లగక్కారు. అలాగే విద్యార్థుల బోధనపైనా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంఈవో మొయినుద్దీన్‌ను గట్టిగానే హెచ్చరించారు. ఆయా ప్రైవేటు స్కూళ్ల స్థితిగతులపై సంపూర్ణ రిపోర్టు పెట్టాలని ఆదేశించారు. డీఈవో ఆదేశించి నెలకావొస్తున్నా ఎంఈవోలో మార్పు లేదు. గ్లోబల్ స్కూలుకు సంబంధించి ఇప్పటి వరకు స్ట్రక్చరల్ సౌండ్‌నెస్ సర్టిఫికెట్ స్వాధీన పరుచుకోలేదు. కాగా ఏ స్కూలులోనూ డైనింగ్ హాల్స్ లేవు. విద్యార్థులు వరండాల్లో భోజనాలు చేస్తున్నారు. తాగునీటి వసతులు సరిగ్గా లేక ఇళ్ల నుంచి నీళ్ల బ్యాటిళ్లు తెచ్చుకుంటున్నారు. వేలకువేలు ఫీజులు చెల్లించినా సరైన వసతులు లేకపోవడంపట్ల విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్త పరుస్తున్నారు. ఎంఈవో తీరుపై సర్వత్రా మండిపడుతున్నారు. ఈ విషయమై ఎంఈవో మొయినుద్దీన్ అడుగగా డీఈవో కేవలం గ్లోబల్ స్కూలు స్ట్రక్చరల్ సర్టిఫిరుట్ మాత్రమే సమర్పించాలని చెప్పారని నిర్లక్ష్యపు సమాధానంతో సరిపెట్టుకున్నారు.

15న విజయవాడలో మహా ధర్నా

ఆదోని రూరల్: ఈనెల 15వ తేదీన విజయవాడలో చేపట్టే గ్రామసేవకుల మహా ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదరి ఎం.డి.అంజిబాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, గ్రామసేవకుల సంఘం గౌరవాధ్యక్షులు బి.రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద గ్రామ సేవకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పే స్కేల్ అమలు చేయాలని, నైట్ డ్యూటీలను రద్దు చేయాలని, డీఏలను జీతంలో కలపాలని, నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో వీఆర్ఏలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజు, శాంతిరాజు, నాగరాజు, హైమావతి, రంగన్న, తిక్కప్ప తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మహిళలకు సౌకర్యాలు కల్పించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలకు కనీస మౌలిక వసతులు కల్పించాలని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వాణి, ఈరమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలకు శౌచాలయాలు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన కూటమి ప్రభుత్వం బస్టాండ్‌లలో కనీస వసతులు కల్పించడంలో ఘోరంగా విఫలమవుతుందన్నారు. సమావేశంలో సమాఖ్య నాయకులు చామంతి, నాగమ్మ, లక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

దేశరక్షణలో భాగస్వాములు కావాలి

ఎమ్మిగనూరుటౌన్: దేశరక్షణలో భాగస్వాములు కావాలని ఏబీవీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు శ్రీరాం సూచించారు. పట్టణంలోని రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఏబీవీపీ విభాగ్ అభ్యస వర్గ శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం శోభాయాత్రను స్థానిక కుర్ని కళ్యాణ మండపం వద్ద ఏబీవీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు శ్రీరాం జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి బయలుదేరిన శోభాయాత్ర సోమప్ప సర్కిల్ మీదుగా అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకుంది. అక్కడ డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా సంఘటన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కన్వీనర్ వీరేష్, నంద్యాల జిల్లా కన్వీనర్ యుగంధర్, నాయకులు శ్రీనివాసులు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మంత్రాలయం రూరల్ : మండలంలోని మాధవరం తండా గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని, రెండింటినీ సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. క్రీడకారులకు సూగూరు కరణం స్వామి ఆధ్వర్యంలో క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు విశ్వనాథ్ రెడ్డి, సి.వి కాంత్ రెడ్డి ఉన్నారు.


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మండలంలోని సూగూరు గ్రామంలో దేవర నాగప్ప, వీరేశమ్మల కుమారుడు బీరప్ప(5) బైక్ పై నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ.10వేలు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.


బాధితులను పరామర్శిస్తున్న వై. ప్రదీప్ రెడ్డి

ఘనంగా ఎర్రకోట జగన్ జన్మదిన వేడుకలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లోని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నివాసంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని మూడు మండలాలు, పట్టణం నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆయనకు పూలమాలలు, శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ కేశన్న, పార్టీ శ్రేణులు

చిన్మయమిషన్ అమృతోత్సవాలు


బహుమతులు అందుకున్న విద్యార్థులతో చిన్మయ మిషన్ సభ్యులు

ఆదోని సెంట్రల్: చిన్మయ మిషన్ స్థాపించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో చిన్మయ మిషన్ మందిరంలో అమృతోత్సవాలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్మయ మిషన్ ఆచార్యులు బహ్మచారి నారాయణ చైతన్య మాట్లాడుతూ మన జీవితంలోని ప్రతి సమస్యకు భగవద్గీత సమాధానం ఇస్తుందన్నారు. అందురు ఆ పుస్తకాన్ని పూజ గదికే పరిమితం చేయకుండా నిత్యం పారాయణం చేయాలని సూచించారు. అనంతరం గీతాపఠనం పోటీలను నిర్వహించారు. అందులో ప్రతిభ చాటిన వివిధ పాఠశాలలకు చెందిన 36 మంది విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ అధ్యక్షుడు యగ్గటి ప్రతాప్ కో ఆర్డినేటర్ సుజాతమ్మ, కార్యదర్శి రఘునాథ్, మిషన్ సభ్యులు బాదమి శ్రీనివాస్, ఇ. శ్రీనివాస్, జగదీష్ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని పట్టణ సమగ్రాభివృద్ధికి పోరాడుదాం

ఆదోని రూరల్: ఆదోని పట్టణ సమగ్రాభివృద్ధి కోసం పోరాడుదామని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదోని పట్టణ సమగ్రాభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశులు, జిల్లా సీనియర్ నాయకులు రామాంజినేయులు మాట్లాడారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్ల, ఎన్నికైన ప్రజాప్రతినిధులు వల్ల పరిశ్రమలు మూతపడుతున్నాయన్నారు. ఆదోని పట్టణంలో అభివృద్ధికై ఫ్యాక్టరీల ఏర్పాటు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, యువతకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాల్, తిప్పన్న, వీరేష్, వెంకటేష్, నాగరాజు, ఈరప్ప తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

తియ్యని ఫలం

కోసిగి: మండలంలో తియ్యని సీతాఫలం పండ్లు అత్యధికంగా లభిస్తాయి. కోసిగిలోని తిమ్మప్ప కొండ, బసవన్న కొండ, రంగప్ప గట్టు, మద్యుల గట్టులలో సీతాఫలం వృక్షాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడడంతో పండ్లు విరివిగా దొరుకుతున్నాయి. కోసిగిలో కడపాళెం వీధికి చెందిన 15 కుటుంబాలు వేకువ జామున కొండలను వెళ్లి రోజుకు ఒక్కొక్కరు 1000 నుంచి 2000 కాయలు తెచ్చి కోసిగి ఆర్టీసీ బస్టాండ్‌లో విక్రయిస్తున్నారు. 100 కాయలు రూ.300 చొప్పున, పండ్లు రూ.500 చొప్పున అమ్ముతున్నారు. సీతాఫలం పండ్లు కొనేందుకు ప్రజలు చాల ఇష్టపడుతున్నారు.


కోసిగి బస్టాండ్‌లో విక్రయానికి ఉంచిన సీతాఫలం పండ్లు